# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

# ఔదార్యం

- రావి.ఎన్.అవధాని

"ఓల్డాన్! ఏడకెల్లాల?"

"సోడారం!"

"మూటల ఏటుంది?"

"నెయ్యిలు! పేలాలు భావూ!"

"నగేజీ రెండ్రూపాయలవుద్ది!"


"నగేజీ ఏటండీ? బరువునేదు భావూ! తవరు సూడండి!"

"నాబంనేదు..."

"ఆపండాపండి! నగేజీ ఉచ్చుకోండి!"

"బేగెక్కు! రవిట్ నాగించుగురూ! పది రూపాయ ల్దియు. ఇయిగో టికెట్లు! లోనకెళ్లాల! ఎదరకెల్లి గూకో!" అన్నాడు కండక్టర్.

బస్సు ఎక్కిన వ్యక్తిని చూసి ప్రయాణీకులు గతుక్కుమన్నారు. నల్లగా నిగనిగలాడుతూ కండలు పొంగి చెమట వాసన గుప్పుమంటున్న శరీరం! కోరమీసాలు, ఎర్రబారిన కళ్లు, మోకాళ్లవ రకూ పంచ, చేతులు లేని బనీను, నిర్లక్ష్యధోరణి చూసినవారి గుండెల్లో చిన్నదడ పుట్టకమానదు. కూనీలు చేయడానికి ఏమాత్రం వెనుకంజవేయని



## త్యాగం

''మా డాడీ నా పాకెట్ మనీ తగ్గించేసారు'' దిగులుగా అన్నాడు దివాకర్.

''అరె! అలా అయితే మన ప్రేమ త్యాగం వైపు పరుగెడుతోందన్నమాట'' సాలోచనగా అంది దివ్య.

## మానిపించా!

''మీవారి చేత తాగుడు, పేకాట మానిపించావటగా!'' అడిగింది రాణి.

''అవును. నిజమే!''

''ఎలా?''

''మీవారితో తిరగకుండా కట్టడి చేసా'' చెప్పింది వాణి.

-బి.వి.ఎస్.బాబు (తెనాలి)

## అప్పుడు...

''మీ పెళ్లికి నాకు కనీసం ఓ కొత్త కోకైనా పెట్టేరు కాదు'' నిష్ఠూరంగా అంది పనిమనిషి సీతాలు తన యజమానురాలైన సినీనటితో.

దానికా సినీనటి పనిమనిషిని ఓదార్చుతూ ఇలా అంది-

''హడావుడిలో మర్చిపోయానే. ఇంకోసారి చేసుకున్నప్పుడు పెడతాలే...''


## అదే ఇది

''ఎందుకయ్యా పాపం ఆ కాకిని అదే పనిగా అలా రాళ్ళేసి కొడుతున్నావు?'' కుటుంబరావ్‌ని అడిగాడు ఇంటికొచ్చిన చుట్టం.

దానికి కుటుంబరావు ఇలా బదులిచ్చాడు.

''నిన్న నువ్వు రావడానికి ముందు ఇదే బాబాయ్ అరిచింది.''

- భామకిరణ్ (సీతాఫల్‌మండి)




వాడిలా ఉన్నాడు. అతడు బహుశా ఏదొంగో లేక బందిపోటోనని ప్రయాణీకులు భీతిచెందేరు. స్త్రీలు పైట చెంగులు భుజాల చుట్టూ కప్పుకొని మెడలోని నగలు కనిపించకుండా జాగ్రత్తపడ్డారు.

మొగాళ్లు కూర్చున్న సీట్లల్లో అక్కడక్కడ నాలుగైదు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అయితే అతడిని ఎవరూ తమ సరసన కూర్చోనివ్వలేదు. అతను ఎవరినీ సీటివ్వమని బలవంతం చెయ్యలేదు. ఒక చేత్తో మూట పట్టుకొని బస్సులో చివరంటా నడిచి తిరిగి వెనక్కి కండక్టరు వద్దకు వచ్చేడు.

కండక్టర్ చప్పున తన సీటులోంచి లేచి వెళ్లి రెండు సీట్లలో ఉన్న ప్యాసింజర్లను సర్ది అతనికి సీటు చూపించి కూర్చోమన్నాడు. లేకుంటే అతను తన ప్రక్క ఖాళీసీటులో కూర్చోవచ్చని భయపడ్డాడు.

ఇంతలో బస్సు ఆపి ముగ్గురు మహిళలు, ఇద్దరు పిల్లలూ ఎక్కేరు. వారిలో ఇద్దరు మహిళలు, పిల్లవాడు ఖరీదైన దుస్తులు ధరించేరు. వారు తమ వెంట మూడు పెద్ద సూట్‌కేసులు, రెండు ఎయిర్ బేగ్‌లు తెచ్చేరు.

సూట్‌కేస్‌లు చాల బరువున్నాయి. మహిళలిద్దరూ భారీకాయులే! ముగ్గురు ప్రయాణీకులు కూర్చోవలసిన సీట్లో ఆ ఇద్దరూ ఇరుక్కుని కూర్చున్నారు.

వారి ప్రక్కసీటులో ఓ కాలేజీ స్టూడెంటు కూర్చున్నాడు. అతడిని కాస్త జరగమని పిల్లాడిని అతని ప్రక్కన కూర్చోపెట్టేరు. పిల్లాడి వయస్సు ఆరేళ్లపైనే ఉంటుంది. కాని మనిషి పొట్టివాడు. మూడో ఆమె పల్లెటూరి స్త్రీ. పిల్లను అడ్డాల్లో కూర్చోపెట్టుకుని సీట్లో ఒదిగి పొందికగా కూర్చుంది. పిల్ల పీలగా బలహీనంగా రెండేళ్ల వయస్సున్న పిల్లలా ఉంది.

"టికెట్! ఎక్కడికెల్లాల? ఈ బొట్టికెన్నేల్లు?"

"ఎంకటాపరం బాబూ! నాకు సదుగురాదు! బొట్టి అరిపిగ అవుపడతాదిగాని ఐదు సంకురాతిర్లెనక పుట్టింది బాబూ!"

నిల్చోబెట్టి ఎత్తుచూసి "సూడమ్మా దార్లసెకింగుకి ఎవురేనా అడిగిన బొట్టికి రెండేళ్లని సెప్పాల! నేకుంటే మూడ్రూపాయల ఆఫ్ టికెట్టుదీయాల!"

"ఇంతోటి దానికీ అబద్దమెందుకండాల! మాఁవు తెలితక్కువోల్లం! నోరుజారిత పెమాదం! సారిజీ ఉచ్చుగోండి." అని పది రూపాయల నోటిచ్చింది కండక్టర్ ఆమెకు ఒకటిన్నర టికెట్స్ చిల్లర ఇచ్చేడు.

ఆ ఇద్దరు మహిళలకు, పిల్లాడికి రెండున్నర టికెట్స్, లగేజీ ఇవ్వాలన్నాడు కండక్టర్.

"పిల్లాడి వయస్సు మూడు సంవత్సరాలలోపే కనుక వాడికి హాఫ్ టికెట్ అవసరం లేదన్నారు. "కావాలంటే వాడి బర్త్‌సర్టిఫికేట్ సూట్‌కేస్‌లోనే ఉంది తీసి చూపిస్తాము"న్నారు. అంతేకాదు. "రెండు టికెట్స్ మీద తీసుకొని వెళ్లగలిగిన లగేజి కంటే తమ లగేజి తక్కువే ఉందని అందువల్ల లగేజీకి డబ్బు కట్టనవసరం లేదని" వాదించేరు. బస్సులో ప్రయాణీకులు కొందరు వారికి సపోర్టు చేసేరు.

కండక్టర్ మారు మాట్లాడకుండా రెండు టికెట్స్ చించి వారికిచ్చి డబ్బు తీసుకున్నాడు.

ఈ తతంగమంతా గమనిస్తున్న కాలేజీ స్టూడెంటు చిరునవ్వు నవ్వేడు.

"నీపేరేమిటి బాబూ?" అన్నాడు తన ప్రక్కన కూర్చున్న పిల్లాడితో.

"సూరజ్"

"ఏ క్లాస్ చదువుతున్నావ్? ఏ స్కూల్లో?"

"థర్డ్‌క్లాస్! వినాయక్ కాన్వెంట్‌లో!" అన్నాడు గర్వంగా.

"మూడేళ్లునిండని పిల్లాడు మూడోక్లాస్ చదువుతున్నాడు!

చిత్రం! రెండు కుంచాల పేలాల మూటకు రెండ్రూపాయలు లగేజీ! మరి మూడు క్వింటాళ్ల బరువున్న సూట్‌కేసులకు లగేజీ ఫ్రీ! వారెవా?" అన్నాడు వ్యంగ్యంగా.

కండక్టర్‌కి ఆ మాటలు సూటిగా తగిలేయి. అయితే అతడు వాటిని ఏమాత్రం పట్టించుకోలేదు.

కండక్టర్ లేచి నిల్చుని బస్సులో ప్రయాణీకులను లెక్కించాడు. ముఖం చిట్లించి మరలా జాగ్రత్తగా లెక్కించాడు.

"ఎవురేనా బస్సుల టికెట్ దీసుకోనివారున్నారేటి?" అని ముమ్మారు అడిగేడు. ఎవరూ సమాధానం చెప్పలేదు.

"ఓల్డాన్!" అని బస్సు ఆపించి అందరినీ టికెట్స్ చూపించమని చెక్ చేసేడు. చివరకు ముందుసీట్లో విలాసంగా కూర్చున్న ఓ పెద్దమనిషి టికెట్ కొనలేదని తెలిసింది.

ఆయనే ఇంతవరకూ రూటు బస్సుల్లో ప్రయాణీకుల సేఫ్టీకోసం సాయుధ పోలీసులను ఏర్పాటు చేయాలని చిన్న ఉపన్యాసమిచ్చేడు.

"తను టికెట్ తీసుకోలేదనే విషయం ఇంతవరకూ గమనించకపోవడం కండక్టరుదే తప్పని, అయినా తాను ఎంతో ఉదారస్వభావం గలవాడు కనుక ఎక్కిన స్టేజి నుండీ ఛార్జీ చెల్లిస్తున్నానని

లేకుంటే ఇక్కడి నుంచే చెల్లించాలని" తన ఔదార్యం వ్యక్తం చేసేడు. 'కండక్టర్ అప్రమత్తంగా ఉండాలి!' అని సలహా ఇచ్చేడు.

మరో పది నిముషాల్లో ఆకాశంలో నల్లని మేఘాలు నలుమూలలా వ్యాపించి చిన్న చినుకులు పడనారంభించేయి.

"గురూ! కూసింత ఉసారుగా నాగించు! వొర్సం పెద్దదవకుండా మనం బేగెల్లి వొడిగెడ్డ దాటేయాల! నేకుంటే గెడ్డొచ్చి సిక్కడిపోతాం!" అన్నాడు కండక్టరు.

"ఏటి నాగించటం! దీనికీ వావొయసుంది! గట్టిగా తొక్కితే తొంగుంటాది! ముసల్దానికి పడుసు ఏసం కట్టిపెంచి గెంతేస్తే ఎటవుద్ది? సతికిల బడుద్ది!" అన్నాడు డ్రైవరు కూడా.

వర్షం క్రమంగా ఎక్కువైంది. బస్సు వడిగెడ్డ వద్దకు చేరుకునేసరికి అరగంట పట్టింది. గెడ్డలో నీరు చాల వేగంగా ప్రవహిస్తోంది. గెడ్డలో నీరు తగ్గందే బస్సు అవలి ఒడ్డుకు చేరదు. సుమారు ఒక గంట ఆగాల్సిందే! మరోదారి లేదు. పావుగంటలో వర్షం పూర్తిగా తగ్గింది కాని గాలి జోరుగా వీస్తోంది.

అవతలి గెడ్డకు అవలివైపున రెండు బస్సులు చేరుకుని ఉన్నాయి. ప్రయాణీకులు క్రిందకు దిగి గెడ్డ ఒడ్డున నిల్చున్నారు.

ఈ బస్సులో ప్రయాణీకులు కూడ క్రిందకు దిగి గెడ్డ ఒడ్డున నిల్చున్నారు. ఇద్దరు ముగ్గురు ఒకరి చేతులు ఒకరు పట్టుకొని మెల్లగా నీటిలో దిగి ప్రవాహ వేగం అంచనా వేస్తున్నారు. చిన్నపిల్లలు ఉత్సాహంతో కేకలు వేస్తూ గెంతుతున్నారు. పెద్దవారు వారిని అదుపుచెయ్యడానికి తంటాలు పడుతున్నారు.

ఇంతలో ఓ వాలుగేళ్ల అమ్మాయి బురదలో జారి గెడ్డ నీళ్లల్లో పడి కొట్టుకొనిపోతోంది.

వెంటనే హాహాకారాలు "రక్షించండి! రక్షించండి! పిల్లను కాపాడండి!" అనే అరుపులు మిన్నుముట్టేయి. ఎవరూ నీట్లో దిగడానికి సాహసించలేదు.

కోరమీసాల ఆసామీ చప్పున నీళ్లల్లోకి దుమికేడు. పది బారల్లో ఆ పిల్లను ఒడిసి పట్టుకొని ఒడ్డుకు చేర్చేడు. పిల్లకు ఏమీ కాలేదు. నీళ్లుకూడ ఏమీ మ్రింగినట్లులేదు. పిల్ల ధైర్యమంతురాలే! వెంటనే తేరుకుంది.

అంతకు ముందు దొంగేమో, బందిపోటేమో అని భావించి ఏవగించుకున్నవారంతా ఇప్పుడు మీసాల ఆసామీ సాహసాన్ని కొనియాడేరు. పిల్ల ప్రాణాలు కాపాడినందుకు అతడిని అభినందించేరు. కృతజ్ఞతలు వెల్లడించేరు.

పిల్ల తల్లి చకచకా తడిబట్టలు ఊడదీసి పొడి గౌను, లాగు వేసింది. తడిలేకుండా తల తుడిచింది.

కోరమీసాల వ్యక్తి నీళ్లోడుతూ అలాగే నిల్చున్నాడు. అతడి వద్ద తల తుడుచుకునేందుకు కూడ మూరెడు పొడిబట్టలేదు.

గెడ్డలో నీరు పూర్తిగా తగ్గింది. అవలి గట్టున ఆగివున్న రెండు బస్సులూ యివతలవేపు వచ్చి వెళ్లిపోయాయి.

బస్సు బయల్దేరబోయే సమయంలో పిల్ల తల్లి 'కెవ్వ్' మంది.

"ఏం జరిగింది?" అని ప్రయాణీకులు అడిగేరు.

"గొలుసు! పిల్ల మెడలో రెండు కాసుల బంగారు గొలుసు... పోయింది." అంది ఆమె బొంగురు గొంతుకతో.

అందరి దృష్టి కోరమీసాల వ్యక్తిమీద పడింది. "పిల్లను నీళ్లలోంచి రక్షించి గొలుసు కాజేసి ఉంటాడు" అని అందరూ భావించేరు.

ప్రయాణీకులలో నలుగురు పెద్దమనుషులు ముందుకు వచ్చి అతడిని సోదా చేసేరు. "తాను దొంగను కానని, గొలుసు సంగతి తనకు తెలియదని" చెప్పేడు. అతని గోడు ఎవరూ వినలేదు. అతనివద్ద గొలుసు దొరకలేదు.

"బంగారు గొలుసు బహూశా మూటలో దాచి ఉంటాడని" అతని మూటను బలవంతంగా రోడ్డుమీదకు తెచ్చి మూట కట్టు ఊడదీసి రోడ్డుమీద గుమ్మరించేడు.

వెంటనే పేలాలన్నీ గాలికి ఎగిరిపోయాయి. గొలుసు లేదు. ఖాళీ సంచి మాత్రం వారి చేతుల్లో ఉంది.

"ఇలా కాదు ఎదర దారిలో వీడిని పోలీసుస్టేషన్లో అప్పగిస్తే వారే నిజాన్ని రాబడతారు. గొలుసు కక్కిస్తారు!" అని సలహా ఇచ్చేరు.

"మమ్మీ! నా గొలుసు పోలేదు! తడి గౌనులోనే ఉంది యిదుగో" అని ఆ పిల్ల కేకవేసింది. పిల్ల తల్లి తడిగౌను విప్పేతొందరలో మెడలో గొలుసు గౌనుతో వచ్చేసింది. అది ఆమె గమనించలేదు.

పెద్దరికం వహించిన నలుగురు పెద్దలూ నిర్ఘాంతపోయేరు. అవమాన భారంతో తలలు వంచుకొని బస్సులో కూలబడ్డారు. నోట మాట రాలేదు.

"ఉన్నవాళ్లకు నష్టం జరుగబోతే ఆదుకుని తమ ఔదార్యం ప్రకటించుకునేందుకు పదిమందీ ముందుకొస్తారు! కాని లేనివానికి ఎంత నష్టం జరిగినా ఎవరూ పట్టించుకోరు! సానుభూతి ప్రకటించరు!" ★

## ఈత ప్రాక్టీస్



మామూలుగా ఈత కొట్టడం అనేది అందరికీ తెలిసిందే. అయితే బ్రిటన్‌లో ఈ మధ్య ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం ఈత పోటీలకు వెళ్లిన వారికోసం ఓ వింత పరీక్ష పెట్టారుట అక్కడి అధికారులు. ఈతలో ఆరితేరిన వారి కోసం 60 గజాలు లోతువున్న ఓ కాలువలో మనిషి నీళ్ళ అడుగున వుండి కనిపించకుండా ఈత కొట్టాలిట. ఓవైపు ఆక్సిజన్ పైపు ఇస్తారుట. అయితే ఈ పైపు సరిగా పట్టుకోకపోతే ఇంతే సంగతులట. 15 సంవత్సరాలనుండి 50 సంవత్సరాల వయసు ఉన్నవారు ఈ పోటీలో పాల్గొనవచ్చని చెప్పడంతో చాలామంది భయపడకుండా పాల్గొన్నారట. చేతులు, కాళ్ళు ఆడించకూడదు అనే రూలు మాత్రం పెట్టారుట. అయితే సరదాగా, మజాగా వున్న ఈ పోటీలో థ్రిల్ కావాలనుకున్నవారు పాల్గొని రికార్డు సృష్టించారట.

## కృత్రిమ గుండె

నిరుడు అమెరికాలోని టామ్ క్రిస్టసన్ అనే వ్యక్తి గుండె నొప్పితో బాధపడుతూ హాస్పిటల్‌కి వెళితే 'నువ్వు బతకవని' డాక్టర్స్ కన్‌ఫర్మ్ చేసి చెప్పారట. అతికష్టమ్మీద నెలరోజులు బతకవచ్చని డిసైడ్ చేశారుట. తాత్కాలికమేనంటూ కృత్రిమ గుండె అమర్చారట. అయితే ఈ 71 ఏళ్ళ టామ్ ఈమధ్యే తనకు కృత్రిమ గుండె అమర్చి ఏడాది కావడంతో పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా జరుపుకున్నాడట. అయితే ఈ పార్టీలో అతిథులు చాలామంది అతనికి కృత్రిమ గుండె అమర్చిన డాక్టర్లేనట. ఏదో బతికినా కొద్దిరోజుల మాత్రమే అని, ఇలా ఏడాదిపైగా బతికి ఉండడం తమకే ఆశ్చర్యంగా ఉందని డాక్టర్లు సైతం ఆశ్చర్యపోతున్నారట. ఈమధ్యకాలంలో తనకి అప్పుడప్పుడు జ్వరం రావడం తప్పితే మరే అనారోగ్యం లేదని చెప్తున్నాడు. ఇక కృత్రిమ గుండెలకు గిరాకీ పెరుగుతుందన్నమాట.

- ప్రియ

